


అంజనాద్రి ఆలయంలో ఏర్పాట్లు

పాతబజార్ చిన్నహనుమాన్ దేవాలయంలో కొలువైన ఆంజనేయస్వామివారు

జై శ్రీరాం.. జై హనుమాన్

- నేడు పెద్ద హనుమాన్ జయంతి
- ప్రత్యేక పూజలు, దీక్షా విరమణలు

కరీంనగర్ కల్చరల్, మే 31: జిల్లా వ్యాప్తంగా శనివారం పెద్ద హనుమాన్ జయంతిని జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని అంజనేయస్వామి ఆలయాల్ను ముస్తాబయ్యాయి. దీక్షా విరమణలు, ఇరుముడులు, ప్రత్యేక పూజలు, అభిషేకాలకు సిద్ధం చేశారు. ఎక్కడ చూసినా సింధూరవర్ణ వస్త్రధారణలు కలిగిన దీక్షాపరులు కన్పిస్తున్నారు. జిల్లాకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయాలన్నీ దీక్షాపరులు, భక్తుల రామ, హనుమ నామస్మరణలు, భజనలతో మార్మోగను న్నాయి. ఆయా ఆలయాల్లో నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం నగరంలోని పలు హనుమదాలయాల్లో దీక్షాపరుల సందడి నెలకొంది. ఆలయాల్లో జయ శ్రీరాం, జయ హనుమాన్ నామ స్మరణలు, భజనలు, కీర్తనలు మార్మోగాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా ఆలయాల అర్చకులు, గురుస్వాముల ఆధ్వర్యంలో దీక్షాధారులు ఇరుముడి కట్టుకొని దీక్షా విరమణకు బయలు దేరారు. ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, భిక్షలు ఏర్పాటు చేశారు. ఇరుముడుల సందర్భంగా ఆల యాలు దీక్షాపరుల కుటుంబ సభ్యులతో, భక్తులతో కిక్కిరిసి పోయాయి.



ప్రశాంతనగర్ ఆలయంలో ఇరుముడులు కట్టుకోవడానికి సిద్ధమైన హనుమదీక్షాపరులు

టెస్కాబ్ చైర్మన్ పదవికి
'కొండూరి' రాజీనామా

- అవిశ్వాసం నోటీసుతో నిర్ణయం
- కరీంనగర్ డీసీసీ బ్యాంకు చైర్మన్‌గా కొనసాగింపు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అపెక్సు బ్యాంకు (టెస్కాబ్) చైర్మన్ పదవికి కొండూరి రవీందర్‌రావు రాజీనామా చేశారు. బ్యాంకు పాలకవర్గంలో పలువురు సభ్యులు ఆయనపై అవిశ్వాస నోటీసు ఇచ్చిన నేపథ్యంలో రవీందర్‌రావు రాజీనామా చేశారు. ఈనెల 10న అవిశ్వాస నోటీసుపై సమావేశం జరుగనుండగా శుక్రవారం ఆయన తన రాజీనామాను సమర్పించారు. కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ పదవిలో కొనసాగనున్నారు. కరీంనగర్ కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా, టెస్కాబ్ చైర్మన్‌గా ఆయన దశాబ్దకాలంగా పని చేశారు.

● 21న అవిశ్వాస తీర్మానం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే టెస్కాబ్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మాణాన్ని ప్రతిపాదించేందుకు ఆ పార్టీ నాయకులు పావులు కదిపారు. పాలకవర్గంలోని తొమ్మిది మందిలో ఐదుగురు సభ్యులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించి మే21న అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారు. జూన్ 10న అవిశ్వాసపై ఓటింగ్ జరుగనుండగా రవీందర్‌రావు తన రాజీనామాను సమర్పించడం రాజకీయంగా కలకలం రేపింది. ఉమ్మడి జిల్లా పరిధిలోని సిరిసిల్ల నియోజకవర్గం గంభీరావుపేటకు చెందిన రవీందర్‌రావు మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉన్నారు. ఆయన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడిగా పనిచేశారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషిచేస్తాను

-కొండూరిరవీందర్‌రావు

తన రాజీనామా నేపథ్యంలో రవీందర్‌రావు మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు నాపై విశ్వాసం కోల్పోయామని తీర్మానించిన నేపథ్యంలో పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. పదవుల కోసమే పనిచేయకుండా సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. పదేళ్లపాటు టెస్కాబ్ చైర్మన్‌గా పనిచేసే అవకాశం కల్పించిన డీసీసీబీ చైర్మన్లు, ప్యాక్స్ చైర్మన్లు, బ్యాంకు ఉద్యోగులు, సహకార మంత్రిత్వశాఖ అధికారులు, ప్రతినిధులందరికీ రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

● 2015లో టెస్కాబ్ చైర్మన్‌గా..

2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్‌పై పోటీచేసి ఓడిపోయారు. ఏడాది తిరిగేసరికి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరారు. 2015లో కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా ఎన్నికైన రవీందర్‌రావు టీఆర్‌ఎస్ అభ్యర్థిగా టెస్కాబ్ చైర్మన్ పదవిని చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన కరీంనగర్ డీసీసీబీ చైర్మన్, టెస్కాబ్ చైర్మన్‌గా పదవిలో కొనసాగుతున్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత రవీందర్‌రావు మాజీ మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా మారడంతోపాటు నియోజకవర్గంలో ఆ పార్టీ క్రియాశీల నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే కేటీఆర్‌కు సన్నిహితంగా ఉంటూ వస్తున్న రవీందర్‌రావుకు చెక్‌పెట్టాలని భావించింది. ఆ క్రమంలోనే టెస్కాబ్ చైర్మన్ పదవి నుంచి ఆయనను తప్పించాలని భావించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం పావులు కదిపి పాలకవర్గంలోని ఐదుగురు సభ్యులను తమవైపు తిప్పుకొని అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించింది. మెజారిటీ కోల్పోయిన రవీందర్‌రావు బల నిరూపణకు ముందే తప్పుకోవాలని నిర్ణయించుకుని శుక్రవారం తన రాజీనామాను సమర్పించారు.

రైతులు ఒకే విత్తనంపై ఆధారపడవద్దు..

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులు ఒకే రకం విత్తనంపై ఆధారపడకుండా విభిన్న రకాలను ఎంచుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. కరీంనగర్ గాంధీరోడ్‌లో మార్కెట్‌రోడ్‌లోని విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్తి విత్తనాల విక్రయాల వివరాలు తెలుసుకున్నారు. ఏ రకం పత్తి విత్తనాలను రైతు లు అధికంగా కొంటున్నారని ప్రశ్నించారు. అనంతరం రిజిస్టర్లను పరిశీలించారు. రెడ్డి ఏజెన్సీలో పత్తి విత్తనాలు కొనుగోలు చేసిన రైతుకు వ్యవసాయ అధికారితో ఫోన్ చేయించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన చెప్పిన వివరాలు, దుకాణంలో ఉన్న వివరాలను సరి చూసుకున్నారు. రైతుల వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచించారు.గోదాముల్లో నిల్వ ఉంచిన పత్తి విత్తనాల బ్యాగులు, వరి విత్తనాల సంచులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విత్తనాలు, పురుగుమందుల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రైతులు లైసెన్సులు ఉన్న వ్యాపారుల వద్దే విత్తనాలు, పురుగు మందులను కొనాలని, రసీదులు తప్పకుండా తీసుకుని భద్రపరుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, కరీంనగర్ ఏడిఏ రణధీర్ రెడ్డి, అర్బన్ వ్యవసాయ అధికారి హరిత పాల్గొన్నారు.

డీసీఎంఎస్‌లో జీలుగ విత్తనాల పంపిణీ

కరీంనగర్ రూరల్, మే 30: జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్‌కు శుక్రవారం 50.1 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయి. వాటిని ఉదయం నుంచి రైతులకు పంపిణీ చేశారు. ఇంకా 45 బస్తాలు మిగిలాయని మండల వ్యవసాయాధికారి బి సత్యం తెలిపారు. శనివారం తీగలగుట్టపల్లి డీసీఎంఎస్‌కు 50 క్వింటాళ్లకు ఇండెంట్ పెట్టామని ఆయన చెప్పారు. కరీంనగర్ రూరల్ మండలంలో ఇప్పటి వరకు 79 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను పంపిణీ చేశామన్నారు. రైతులందరికీ జీలుగ విత్తనాలను సకాలంలో అందిస్తామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తి చేయాలి

- పండగలా బడిబాటను నిర్వహించండి.
- కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, మే 31: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలాసత్పతి అధికారులను ఆదేశించారు. మండలంలోని ముంజంపల్లి, జగ్గయ్యపల్లి పాఠశాలల్లో జరుగుతున్న పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనుల వివరాలు, వ్యయం, ఎంత వరకు పనులు పూర్తయ్యాయి అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక కృషి చేయాలని ఆమె సూచించారు. జూన్ 3నుంచి 19 వరకు జరిగే బడిబాట కార్యక్రమాన్ని పండగలా చేపట్టాలన్నారు. జూన్ 4లోపు పనులన్నీ పూర్తి చేయాలాన్నరు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్‌షెడ్ల నిర్మాణంతోపాటు మంచినీరు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. జూన్ 4లోపు పనులన్నీ పూర్తి చేసి పాఠశాలలను అందంగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో జనార్దన్‌రావు, ఎంపీడీవో ఎం నర్సయ్య, ఎంఈవో మధుసూదనాచారి పాల్గొన్నారు.



మానకొండూర్‌లోని పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలాసత్పతి

పొగాకు ప్రాణాంతకం

- డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

సుభాష్‌నగర్, మే 31: పొగాకు ప్రాణాంతకమని, సిగరెట్, పాన్‌మసాల, జర్దా, గుట్కా, తంబాకు తీసుకోవడం వల్ల రోజుకు 3,500 మంది చనిపోతున్నారని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత తెలిపారు. ప్రపంచ పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్యఆరోగ్యశాఖ ఆద్వర్యంలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వల్ల అసంక్రమిత వ్యాధులైన క్యాన్సర్, రక్తపోటు, ఊపిరితిత్తుల వ్యాధులు, కార్డియో మస్కులర్ వ్యాధులు, డయాబెటిక్ వంటివి వస్తాయన్నారు. వీటి వల్ల 60 శాతం మరణాలు సంభవిస్తున్నాయన్నారు. మన రాష్ట్రంలో పొగాకు ఉత్పత్తుల అమ్మకం నిషేధ చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో పొగ తాగడం నేరమన్నారు. 18 సంవత్సరాలలోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తుల అమ్మకంపై నిషేధం ఉందని తెలిపారు. పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల వచ్చే వ్యాధుల గురించి జిల్లాలోని 128 విద్యా సంస్థలు, 148 గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, పాఠశాలల వద్ద పొగాకు నిషేధ హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి కేవీ రవీందర్‌రెడ్డి, ఎంసీహెచ్ పీవో డాక్టర్ జువేరియా, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ శిల్ప, ఎస్‌వో ఆర్‌ఎల్ కాంతారావు, డెమో రంగారెడి పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

హుజూరాబాద్ కేంద్రంగా
పీవీ జిల్లా ఏర్పాటు చేయాలి



హుజూరాబాద్‌లో మాట్లాడుతున్న జిల్లా జేఏసీ నాయకులు

హుజూరాబాద్, మే 31: హుజూరాబాద్ కేంద్రంగా పీవీ జిల్లాను ఏర్పాటు చేయాలని జిల్లా సాధన జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూరాబాద్ మున్సిపల్ పార్క్‌లో జిల్లా సాధన జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ భీమోజు సదానందం మాట్లాడుతూ హుజూరాబాద్‌కు చుట్టు పక్కల ఉన్న 14 మండలాలను కలుపుకుని జిల్లాగా ప్రకటించాలన్నారు. 2016లో జిల్లాల విభజన అశాస్త్రీయంగా జరిగిందని, జిల్లాల పునర్విభజనపైన వార్తలు వస్తున్న నేపథ్యంలో పీవీ నర్సింహారావు పేరుతో హుజూరాబాద్ కేంద్రగా జిల్లా ఏర్పాటు చేయలాని డిమాండ్ చేశారు. హుజూరాబాద్‌ను జిల్లాగా ప్రకటించేంత వరకు జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వేల్పుల రత్నం, పొడిశెట్టి వెంకట్రాజం, ఆలేటి రవీందర్, కొడిగూటి మొగిలయ్య, రాజన్న, రమేష్, శేఖర్, ప్రభాకర్, సారయ్య, సమ్మయ్య, రాజేశ్వర్, రవీందర్, రాజలింగం, వెంకన్న పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- మల్టీజోన్ ఐజీ-1 ఏవీ రంగనాథ్

కరీంనగర్ క్రైం, మే 31: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మల్టీజోన్ ఐజీ-1 ఏవీ రంగనాథ్ అన్నారు. పోలీస్ కమిషనరేట్ పోలీసులకు నిర్విహిస్తున్న 2024 వార్షిక స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఐజీకి సీపీ అభిషేక్ మొహంతి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐజీ రంగనాథ్ మాట్లాడుతూ ఇన్ని రోజులు ఎన్నికల విధుల్లో ఉండి, మరో నాలుగు రోజుల్లో కౌంటింగ్ ఉండగా ఈ మధ్యకాలంలో అతి తక్కువ సమయంలో గొప్ప మీట్ నిర్వహించిన సీపీని అభినందించారు. నిత్యం విధుల్లో ఉండే పోలీసులకు క్రీడల వల్ల మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వం, ఆత్మ విశ్వాసం పెంపొందుతుందన్నారు. అంతకు ముందు ఆయన గౌరవ వందనం స్వీకరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.



మాట్లాడుతున్న రంగనాథ్

వడదెబ్బతో ముగ్గురి మృతి

చొప్పదండి, మే 31: చొప్పదండి, వీణవంక మండలాల్లో, పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీలో వడ దెబ్బతో ముగ్గురు మృతి చెందారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జాకీర్ హుస్సేన్(60) పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లోని సిమెంట్ ఫ్యాక్టరీలో లారీ డ్రైవర్‌గా పనిచే స్తున్నాడు. శుక్రవారం సిమెంట్ బస్తాల లోడ్‌తో లారీని చొప్పదండికి తీసుకురాగా రహదారి పక్కన నిలిపి మంచినీరు తాగి లారీ వద్ద ఒరిగిపోయాడు. గమనించిన స్థానికులు పోలీసుల కు సమాచారం అందించగా లారీ నంబర్ ఆధారంగా మృతుడి వివరాలను తెలుసుకున్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీణవంక: మండల కేంద్రానికి చెందిన కళ్యాణం రామక్క (75) వడ దెబ్బతో శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం రెండు రోజులుగా ఎండ వేడి తీవ్రంగా ఉండడంతో పాటు వేడి గాలి వీయడంతో వడ దెబ్బకు గురై మృతి చెందింది. మృతురాలు రామక్కకు ఇద్దరు కొడుకులు, నలుగురు కూమార్తెలు ఉన్నారు.

జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌కు చెందిన ఈదునూరి కిషోర్(34) శుక్రవారం వడదెబ్బతో మృతిచెందాడు. హనుమాన్ మాల ధరించిన కిషోర్ తోటి భక్తులతో కలిసి ఉదయం పాదయాత్రగా జగిత్యాల జిల్లా కొండగట్టుకు బయలుదేరాడు. ఎండవేడి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయాడు. అతడిని గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా రాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

కోనరావుపేట, మే 31: కోనరావుపేట మండలం నాగారం మర్తనపేట గ్రామాల మధ్యలో బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు కాగా గ్రామస్థులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. వేములవాడ మండలం మారుపాకకు చెందిన మోడిక రవి తన బైక్‌పై మారుపాకకు వస్తుండగా నాగారం-మర్తన్‌పేట గ్రామాల మధ్యలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. గాయాలైన రవిని మర్తన్‌పేట మాజీ సర్పంచ్ వంశీ, లింగాల సత్తయ్య గమనించి 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు.

అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

- విరిగిపడిన కరెంట్ పోల్
- షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన టీవీలు, రిఫ్రిజిరేటర్లు



గొల్లపల్లిలో విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న లారీ

తిమ్మాపూర్, మే 31: మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఓ లారీ విద్యుత్ పోల్‌ను ఢీకొట్టడంతో స్తంభం విరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం ఓ లారీ గొల్లపల్లి నుంచి గుండ్లపల్లి వెళుతున్న క్రమంలో లారీ డ్రైవర్ మద్యం మత్తులో నడుపుకుంటూ వచ్చి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ పోల్‌ను లారీతో ఢీకొట్టాడు. దీంతో స్తంభం విరిగి పడి రోడ్డుపై పడిపోయింది. దీంతో గ్రామంలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో పలు ఇళ్లలో టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఇతర పరికరాలు కాలిపోయాయి. గ్రామస్థులు గమనించి రోడ్డుపై ఉన్న లారీని అడ్డుకున్నారు. డ్రైవర్ అక్కడినుంచి తప్పించుకొని పారిపోయాడు. లారీ డ్రైవర్ మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రేణికుంట వద్ద రాజీవ్‌రహదారిపై ఉన్న టోల్ గేటును తప్పించుకునేందుకు గ్రామాల నుంచి లారీలు వెళుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు అంటున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం

ఆత్మహత్యాయత్నం చేసిన ట్రాక్టర్ డ్రైవర్ మృతి

ముస్తాబాద్, మే 31: మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్థు లు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నామాపూర్‌కు చెందిన తలారి బుచ్చయ్య(45) అనే ట్రాక్టర్ డ్రైవర్ కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్లలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడు బుచ్చయ్యకు భార్య లక్ష్మి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

రైతును బెదిరించిన ఇద్దరి అరెస్ట్

చందుర్తి, మే 31: భూమిని చదును చేసుకుంటున్న ఓ రైతు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. కథనం ప్రకారం మండలం లింగంపేట గ్రామా నికి చెందిన కమటం లక్ష్మీరాజం అనే రైతు గత నెల 23 తెల్లవారుజామున భూమిని ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లతో భూమిని చదును చేయిస్తున్నాడు. వేములవా డ పట్టణానికి చెందిన కొలగాని చందు, ఖమ్మం రమాకాంత్ అనే ఇద్దరు వ్యక్తులతో పాటు ఇద్దరు వ్యక్తులు వ్యవసాయ భూమిని చదును చేస్తున్న రైతు వద్దకు వెళ్లి మైనింగ్ శాఖ అధికారుల అనుమతులు ఉన్నాయా అంటూ బెదిరింపులకు పాల్పడి, రూ. 40 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధిత రైతు ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ పంపామన్నారు. లింగంపేటకు చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

- వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...
- అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?
- కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు...? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలిదానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

- టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్టు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

- ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. 'ఫోన్ ట్యాపింగ్'పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిల్లరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

- రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్



మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్‌వోటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనునన్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి... గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)



కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

- అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

- అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జన భర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగ బద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడి పడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

- కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?
- మహేష్ కుమార్ గౌడ్
- సమ్మక్క సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్థూపానికి రూ. వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మి, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తు చేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా...?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాష్ కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

- అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు
- ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు
- లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?
- 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు
- విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కనకున్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లిండ్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంతర్రాష్ట్రముఠా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం

నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని బోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్,
తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని, దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నేటి నుంచి యోగా శిక్షణ శిబిరం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 31: జూన్ 21న అంతర్జాతీయ యోగాడేని పురస్కరించుకొని అంతర్జాతీయ యోగా ప్రొటోకాల్‌ని కౌంట్‌డౌన్ పేరిట జూన్1 నుంచి 21 వరకు ఉచితంగా యోగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముత్యాల రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఉదయం 5:30 గంటల నుంచి 7 వరకు నిర్వహించే కార్యక్రమంలో సూక్ష్మ వ్యాయామాలు, యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9790126691 నంబరులో సంప్రదించాలని సూచించారు.

రేపు జిల్లా అథ్లెటిక్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మే 31: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నామని జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో సీనియర్ యూత్ కిడ్స్ విభాగాలలో రన్స్ ఎంపిక పోటీలను ఉదయం 6 గంటల నుంచి నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలకు అండర్-8, 10, 12, 14, 16, 18, 20 వయస్సు విభాగాలలో బాలబాలికలు, మహిళలు, పురుషులకు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారులను హన్మకొండలో ఈ నెల 6,7 తేదీలలో నిర్వహించే పదవ తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామని పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనటకు ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 6 గంటలకు అంబేడ్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు.

పత్తి విత్తనాలను పరిశీలించిన అధికారులు

కరీంనగర్ రూరల్, మే31: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌లోని హోల్‌సేల్ డిస్ట్రిబ్యూటర్ల నుంచి శుక్రవారం మండల వ్యవసాయాధికా బి సత్యం పత్తివిత్తనాల శాంపిల్స్ సేకరించారు. బొమ్మకల్‌లోని హన్మాన్ ఆగ్రోస్‌లో శ్రీరాం బయోసీడ్ కంపెనీకి చెందిన జీహెచ్‌హెచ్029, వసంత్‌సీడ్ కంపెనీ-ముద్ర విత్తనాలు, వాణిశ్రీ అగ్రి సర్వీసెస్‌లో అజిత్ సీడ్స్ కంపెనీ-ఏసీహెచ్900-2, మహికో సీడ్-ఎంఆర్‌సీ-7373 పత్తి విత్తనాల ప్యాకెట్లను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి, ఆయా కంపెనీలకు పత్తివిత్తనాల శాంపిల్స్‌ను సేకరించి హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించినట్లు ఏవో తెలిపారు. ల్యాబ్ నుంచి పరీక్షా ఫలితాలు వచ్చిన అనంతరం ఆయా కంపెనీల పత్తివిత్తనాలు డీలర్లకు సరఫరా చేయాలని ఆయా సంస్థల యజమాన్యాలకు సూచించారు.

ఉపాధి హామీ చట్టంలో సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

భగత్‌నగర్, మే 31: ఉపాధి హామీ చట్టంలో తలెత్తుతున్న సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు డిమాండ్ చేశారు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్న రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పది సంవత్సరాలుగా ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ వచ్చిందన్నారు. దీనితో గ్రామీణ పేదలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ నెల 10 నిర్వహించనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు సదస్సుకు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్, జిల్లా నాయకుడు సుంకరి సంపత్, భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు పట్టా చేయవద్దు

● సబ్ రిజిస్ట్రార్‌కు తహసీల్దార్ ఉత్తర్వులు

హుజూరాబాద్, మే 31: హుజూరాబాద్ పట్టణంలోని వరంగల్ రోడ్‌లో వివాదాస్పద అసైన్డ్ భూములు రిజిస్ట్రేషన్ చేయవద్దని శుక్రవారం స్థానిక తహసీల్దార్ విజయ్‌కుమార్ సబ్ రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ వేసి క్రయ విక్రయాలు జరుపుతున్నారని పేర్కొన్నారు. నెల రోజుల క్రితం ఈ వెంచర్‌పై జమ్మికుంట మార్కెట్ మాజీ ఛైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత 50ఏళ్ల క్రితం దళిత నిరుపేదలకు ప్రభుత్వం పెద్ద మోరి సమీ పంలో స్వయం ఉపాధి కింద అసైన్డ్ భూమి ఇచ్చింది. ఈ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారు లు తక్కువ ధరలకు కొనుగోలు చేసి వెంచర్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి నాలా కన్వర్షన్ లేకుం డానే రాత్రి వేళల్లో ప్రభుత్వ గుట్టల నుంచి మట్టిని తీసుకొచ్చి ఈ వివాదస్పద భూమిలో పోశారు. నాలా కన్వర్షన్ లేకుండానే భూములకు బయానా తీసుకుంటున్నట్లు తెలియడంతో రెవెన్యూ అధికారులు విచారణ చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి రిజిస్ట్రేషన్లు ఎవరికి చేయవద్దంటూ హుజూరాబాద్ సబ్ రిజిస్ట్రార్‌కు లేఖ పంపారు. దీనికి స్పందించిన సబ్ రిజిస్ట్రార్ క్రయ విక్రయాలు చేయనని తహసీల్దార్‌కు చెప్పినట్లు తెలిసింది.

వైభవంగా బీరన్న బోనాలు



ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని సన్మానిస్తున్న నిర్వాహకులు

వీణవంక, మే 31: వీణవంక మండలం గంగారం గ్రామంలో బీరన్న బోనాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు తమ ఇళ్ల నుంచి బోనాలతో బీరన్న గుడికి తరలివెళ్లారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముగిసిన హాకీ సమ్మర్ కోచింగ్

హుజూరాబాద్, మే 31: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో నెల రోజుల క్రితం ప్రారంభమైన హాకీ సమ్మర్ కోచింగ్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా క్రీడాకారులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. క్రీడలు మానసిక ఉల్లాస్సాన్ని ఇస్తాయని, ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో బి శ్రీనివాస్, కె శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

శంకరపట్నం, మే 31: శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామంలోని ఆదర్శ పాఠశాల పనులను శుక్రవారం స్పెషలాఫీసర్ నాగార్జున పరిశీలించారు. త్వరగా పనులను పూర్తి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీవాణి, ఎంఈవో వెంటకనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూమి చదును చేసిన వారికి నోటీసులు



ధర్మారంలో విచారణ చేపడుతున్న అధికారులు(ఫైల్)

జమ్మికుంట, మే 31: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మారం గ్రామంలో గల 368 సర్వే నంబర్‌లో 33గుంటల శిఖం భూమిని కొందరు వ్యక్తులు టిప్పర్లతో చదును చేసిన సంఘటనలో నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ విజయ శుక్రవారం తెలిపారు. వార్డు కౌన్సిలర్ బొంగోని వీరన్న జిల్లా కలెక్టర్ పమేల సత్పతికి ఈ నెల 27న ఫిర్యాదు చేశారు. 28న రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టి, నివేదికను ఉన్నతాధికారులకు అందజేశారు. జిల్లా కలెక్టర్ నుంచి రిపోర్టు వచ్చే వరకు శిఖం భూమిలో ఎలాంటి పనులు చేపట్టవద్దని సూచిస్తూ తహసీల్దార్ నోటీసులు జారీ చేశారు. రెండు, మూడు రోజుల్లో శిఖం భూమికి సంబంధించిన రిపోర్టు వెలువడనున్నట్లు తెలుస్తోంది.

స్విమ్మింగ్ వైపు చిన్నారుల చూపు

వేసవి సెలవుల్లో కళకళలాడుతున్న స్విమ్మింగ్ పూల్స్



స్విమ్మింగ్‌లో శిక్షణ పొందుతున్న చిన్నారులు

కరీంనగర్ స్పోర్ట్స్ మే 31: వేసవి సెలవుల్లో ఈత కొలనులు రద్దీగా మారాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈత నేర్పేందుకు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. కరీంనగర్‌లో ముఖ్యంగా మూడు ఈత కొలనులు అందుబాటులో ఉన్నాయి. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న ఈత కొలనులో సమ్మర్ సీజన్‌కు వేయి మందికి పైగా ఔత్సాహికులు వస్తున్నారు. కరీంనగర్ క్లబ్‌లో తమ సభ్యులతో పాటు బయటి వారికి సైతం అవకాశం కల్పిస్తున్నారు. సెయింట్ జాన్స్ పాఠశాల ఆధ్వర్యంలో సైతం ఈత శిక్షణ ఇస్తున్నారు. బ్యాచ్‌ల వారీగా శిక్షణకు అవకాశం కల్పిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ఔత్సాహికులు రావడంతో కొలనులన్నీ ఉదయం, సాయంత్రం కిటకిటలాడుతున్నాయి.

● ఈత చక్కని వ్యాయామం అని డీవైఎస్‌వో బి.శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఈత నేర్చుకుంటే నీటి ప్రమాదాల నుంచి కాపాడుకోవచ్చన్నారు. విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా హనుమాన్ స్వాముల పూజలు



దీక్షాపరులకు ఫలపుష్పదానం చేస్తున్న దామోదర్‌రెడ్డి



హనుమాన్ హవనం నిర్వహిస్తున్న పూజారులు

కరీంనగర్ రూరల్, మే31: మండలంలోని నగునూర్ గ్రామంలో గల శ్రీభక్త ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం ఆంజనేయస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ హవనం, అన్నదాన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. గురు స్వామి బాపురెడ్డి ఆధ్వర్యంలో హవనం జరిగింది అనంతరం వివిధ ప్రాంతాలకు తరలివెళ్లి దీక్షను ముగించే హనుమాన్ దీక్షాపరులకు ఇరుముడులు కట్టారు. ఈ కార్యక్రమానికి దాతగా కస్తూరి రాఘవేందర్‌రెడ్డి ఆర్థిక సౌజన్యం అందించారు. అనంతరం గ్రామ మాజీ ఉప సర్పంచ్ దామెరపెల్లి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో హనుమాన్ దీక్షాపరులకు అన్నదానం, ఫలపుష్పదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి సేవాసమితి సభ్యులు, గ్రామ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తున్న వారికి జరిమానా

కరీంనగర్ టౌన్, మే 31: నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్న వ్యాపార సంస్థలకు నగరపాలక సంస్థ జరిమానా విధిస్తోంది. శుక్రవారం నగరంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్‌లు హోటళ్ల కూరగాయల వ్యాపారులు, చిరువ్యాపారులు ప్లాస్టిక్ కవర్లను వినియోగించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ గట్టు శ్రీనివాస్ తన పరిధిలోని దుకాణ యజమానులను ప్లాస్టిక్ కవర్లను వినియోగించవద్దని హెచ్చరించినా వినియోగిస్తుండటంతో వారి నుంచి రూ.500 జరిమానా వసూలు చేశారు. అలాగే పలుచోట్ల సానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు కూడా ఆకస్మిక తనిఖీలు చేసి జరిమానా విధించారు.

'బొమ్మకల్‌లోని చెరువు శిఖం స్థలం కాపాడాలి'

కరీంనగర్ రూరల్,మే 31: కేంద్ర ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఇష్టానుసారంగా ప్రభుత్వ చెరవు శిఖం స్థలంలో ఒక కమ్యూనిటీకి చెందిన గుడి నిర్మించడానికి ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ భూమి పూజ చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌టీఏ యాక్ట్ కన్వీనర్ కరీంనగర్ నియో జకవర్గ దొమ్మటి బాబు ఉన్నతాధికారులను ఒక ప్రకట నలో కోరారు. గ్రామ పరిధిలోని ప్రభుత్వ పరంపోగు చెరువు శిఖం భూమి సర్వే నెంబర్ 728లోని దాదాపు ఆరుగుంటల భూమిలో మధురానగర్ కాలనీకి చెందిన ఒక కమ్యూనిటీకి చెందిన గుడిని నిర్మించడానికి ఎన్నికల నియామవాళిని ఉల్లంఘిస్తూ భూమి పూజ చేశారని అతనిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని చెరువు శిఖం స్థలాన్ని సంరక్షించాలని ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నగరపాలక సంస్థ డీఈఈపై విచారణ జరిపించాలి

● సీడీఎంఏకు కార్పొరేటర్ బండారి వేణు ఫిర్యాదు

కరీంనగర్ టౌన్, మే 31: నగరపాలక సంస్థ డీఈఈ ఎండీ మసూద్ అలీ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నాణ్యతలేని పనులకు బిల్లులు రికార్డు చేయడం, అభివృద్ధి పనుల అంచనాల తయారీలో కూడా కాంట్రాక్టర్లకు లాభం చేకూర్చి ప్రభుత్వ ఖజానాకు గండికొట్టారని, ఆయన నాలుగేళ్ల పదవీ కాలంలో జరిగిన అభివృద్ధి పనులపై విచారణ జరిపి ఆయనపై చర్య తీసుకోవాలని 41వ డివిజన్ కార్పొరేటర్ బండారి వేణు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు, జిల్లా కలెక్టర్‌కు, పబ్లిక్ హెల్త్ సీఈకి, విజిలెన్సు ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, అదనపు కలెక్టర్‌కు, ఇతర ఉన్నతాధికారులకు డీఈఈ మసూద్‌ను సస్పెండ్ చేయాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించినట్లు తెలిపారు. డీఈఈగా విధుల పట్ల అంకితభావంతో పనిచేయకుండా కాంట్రాక్టర్లకు కొమ్ము కాస్తూ నాణ్యత లేకుండా చేసిన పనులకు వాస్తవ అంచనాల కంటే ఎక్కువ బిల్లులను రికార్డు చేసి డబ్బులు ఇప్పించడంతో ప్రజల్లో నగరపాలక సంస్థకు చెడ్డపేరు వచ్చిందని, పాలకవర్గ సభ్యులు ప్రజల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కిసాన్‌నగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనుల్లో నాణ్యత లేకున్నా బిల్లులు రికార్డు చేయడమే కాకుండా చేసిన పనికంటే ఎక్కువ బిల్లులు రికార్డు చేసి కాంట్రాక్టర్‌కు లబ్ధిచేకూర్చి, నగరపాలక సంస్థకు నష్టం చేశారని ఆరోపించారు. అలాగే బుట్టిరాజారాంకాలనీ పార్కులో నాణ్యతా ప్రమాణాలు లేకుండా పనులు చేశారని, ఒకే పనికి రెండుసార్లు బిల్లులు చెల్లించారని, సుభాష్ నగర్‌లో డ్రైనేజీ నిర్మాణం, నగరంలోని పలు జంక్షన్లలో నాణ్యతకు తిలోదకాలిచ్చిన పనులకు బిల్లులు చెల్లించి అవినీతి, అక్రమాలకు పాల్పడిన డీఈఈ మసూద్‌పై చర్య తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు కార్పొరేటర్ బండారి వేణు తెలిపారు. సదరు డీఈఈపై గతంలో ఫిర్యాదు రావడంతో జిల్లా కలెక్టర్ స్మితాసబర్వాల్ ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేస్తే తిరిగి ఇక్కడికే పోస్టింగ్‌పై వచ్చి అనేక అవినీతికి పాల్పడ్డారని, నాలుగేళ్లలో ఆయన రికార్డు చేసిన బిల్లులకు సంబంధించిన అభివృద్ధి పనులపై విచారణ చేపట్టి చర్య తీసుకోవాలన్నారు.

రూ.7,350 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మే 31: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,350 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 20మంది రైతులు 367 క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు రెండు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7350, కనిష్ఠ ధర ఆరువేల రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

నేడు హనుమాన్ జయంతి ఉత్సవాలు

హుజూరాబాద్, మే 31: పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రతాప నాగరాజు శుక్రవారం తెలిపారు. హనుమాన్ భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకొని ర్యాలీలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ హాజరవుతారని తెలిపారు.

అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి

జమ్మికుంట రూరల్, మే 31: తెలంగాణ అమరవీరులను ఆదుకోవాలని నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ లోగోను మార్చినట్లు అమరవీరుల కుటుంబాల జీవితాలను మార్చి వెలుగులు నింపాలన్నారు. జూన్ 2న జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబాలకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేసియా, ఇళ్లు, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

వేములవాడ కోడెలకు గడ్డి వితరణ

గంగాధర, మే 31: వేములవాడ దేవాలయం కోడెలకు గర్శకుర్తి రైతు గడ్డి వితరణ చేశారు. గరకుర్తికి చెందిన కొలకాని గణేష్ 800 కిలోల గల 40 గడ్డి కట్టలను వేములవాడ దేవస్థానానికి అందించాడు. ఈ సందర్భంగా ట్రాక్టర్‌లో గడ్డి కట్టలను దేవస్థానం సిబ్బందికి అందించారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

హుజూరాబాద్‌రూరల్, మే 31: కళాశాల నుంచి వెళ్లే విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని సాధించి ఉన్నత స్థానంలో స్థిరపడాలని కిట్స్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె శంకర్ అన్నారు. మండలంలోని సింగాపూర్ గ్రామంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు వీడ్కోలు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ కళాశాల జీవితం పూర్తి చేసుకొని బయటి ప్రపంచంలో అడుగుపెడుతున్న వేళ విద్యార్థులు జాగ్రత్తగా ముందుకు సాగాలన్నారు. ఉద్యోగ సాధనలో సరైన వ్యూహాలు పాటిస్తే అద్భుత భవిష్యత్ ఉంటుందన్నారు. సీనియర్ విద్యార్థులు ఉన్నతమైన ఉద్యోగాన్ని సాధించి జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా నిలువాలన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఈశ్వరయ్య మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రతిరోజు కంప్యూటర్ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా స్కిల్స్‌ను నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి కల్లెం రవీంద్రబాబు, కార్యక్రమ సమన్వయకర్తలు ప్రదీప్, దీపక్, విద్యార్థులు ఉన్నారు.

వన్నారం చెరువులో ఆగని మట్టి అక్రమ రవాణా



చెరువులో మట్టి తవ్వకాలు

రామడుగు, మే 31: మండలంలోని వన్నారం చెరువులో అక్రమ నల్లమట్టి రవాణా కొని రోజులుగా కొనసాగుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడనే విమర్శలున్నాయి. 15 రోజుల క్రితం ప్రారంభమైన మట్టితీత కార్యక్రమం వివిధ పత్రికల్లో వచ్చిన కథనాల మేరకు నిలిపివేశారు. మట్టి రవాణా విషయంలో ప్రత్యేకాధికారి, కార్యదర్శి ఎంపీపీ సమక్షంలో బాహబాహీ దిగి అక్రమ మట్టి వ్యాపారులను నిలదీయడంతో కొద్ది రోజులుగా పనులను నిలిపివేశారు. గ్రామంలోని పలువురి సమక్షంలో అక్రమ రవాణా మళ్లీ మెదలైంది. అక్రమ దందాకు అలవాటు పడ్డ మట్టి వ్యాపారులు ఏ మాత్రం పట్టువదలకుండా తమ పనిని యథేచ్ఛగా కొనసాగించడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇచ్చిన అనుమతి కంటే అధికంగా మట్టిని తరలిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని అక్రమ మట్టి తరలింపును అడ్డుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈఈ వివరణ కోరగా 1,500 క్యూబిక్ మీటర్ల మేరకే మట్టి తీసేందుకు అనుమతి ఇచ్చామని అంతవరకే పని జరుగుతుందని ఆయన వివరించారు.

నత్తనడకన 'అమ్మ ఆదర్శ పాఠశాలల' పనులు



కొండాపూర్ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈవో(ఫైల్)

చిగురుమామిడి, మే 31: మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. 17 గ్రామాల్లో గల 21 పాఠశా లల అభివృద్ధికి గాను అమ్మ అదర్శ పాఠశాలలకు ఎంపికైన వాటికి దాదాపు 65 లక్షల పైచిలుకు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. మండల వ్యాప్తంగా 32 ప్రభుత్వ పాఠశాలల ఉన్నాయి. ఒక్కో మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలు ఉన్నాయి. మొదటి విడతగా మన ఊరు-మన బడి పథకం ద్వారా 11 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలకు ఎలాంటి నిధులు కేటాయించలేదు. రెండో విడతగా అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి కోసం దాదాపు 65 లక్షలకు పైగానే నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 13 పాఠశాలలు ఎంపీపీఎస్, యూపీఎస్ నాలుగు, నాలుగు జిల్లా పరిషత్ పాఠశాలలో పలు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలల్లో ఆయా గ్రామాలకు సంబంధించిన గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, వాటర్ ట్యాంక్‌ల ఏర్పాటు, పాఠశాలల చుట్టూ ప్రహరీ నిర్మాణం, అన్ని తరగతి గదుల్లో ఫ్యాన్లు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు పనులు చేస్తున్నారు. పలు సందర్భాల్లో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించినప్పటికీ పనులు వేగవంతంగా జరగడంలేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. పాఠశాలల ప్రారంభ తేదీ దగ్గరకు వస్తున్నప్పటికీ పనులు నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పనుల బాధ్యతలను ప్రభుత్వం గ్రామైఖ్య సంఘాలకు ఇవ్వడంపై సంతోషంగా ఉన్నప్పటికీ, పనులు కొంత మేరకు ఆలస్యంగా జరగడంపై ఆయా గ్రామాల విద్యార్థుల తల్లితండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యే వరకు పనులు పూర్తి చేసేలా అధికారులు, నిర్వాహకులు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

సుభాష్‌నగర్, మే 31: వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక బ్లూబెల్స్‌లో గత పదిరోజులగా నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారం ముగిశాయి. ఈ శిక్షణ శిబిరంలో పిల్లలకు భగవద్గీత శ్లోకాలు, రామాయణం, క్విజ్ గేమ్స్, ల్యూసిడ హ్యాండ్ రైటింగ్, వేద గణితం నేర్పించారు. కార్యక్రమంలో బ్లూబెల్స్ కరస్పాండెంట్ జంగ సునీత, క్లబ్ గవర్నర్ జంధ్యం మాధవి, కార్యదర్శి మధుకర్, ఐపీసీ చందా రవీందర్, క్లబ్ అధ్యక్షురాలు చందా విజయలక్ష్మి పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి బియ్యం అందజేత

కరీంనగర్ రూరల్, మే 31: మండలంలోని చామనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుర్ర లింయగ్య సతీమణి బుర్ర లక్ష్మీ ఇటీవల గుండెపోటుతో మరణించింది. ఆమె కుటుంబ సభ్యులకు టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేనేని రోహిత్ రావు ఆదేశాల మేరకు క్వింటాల్ బియ్యం అందజేసి మృతురాలి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు జగ్గాని కనుకయ్య, మండల ప్రధాన కార్యదర్శి బుర్ర స్వామి, కార్యదర్శి జూపల్లి విష్ణు, రాజుగౌడ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్ రూరల్, మే31: నకిలీ విత్తనాలపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారులు సూచించారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం మందులపల్లి, బహ దూర్‌ఖాన్‌పేట, దుబ్బపల్లి గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోళ్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు పైడిపల్లి, బీటీఎం శ్రీలత, ఏటీయం రమ్య ఉన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే గుర్తింపు రద్దు చేయాలి

గణేష్‌నగర్, మే 31: అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వేర్వేరు పేర్లతో ఫీజులు వసూలు చేయడమే కాకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు.

డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదు ప్రారంభం

భగత్‌నగర్,మే 31: కొత్తపల్లి మండలంలో డీవైఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి లక్ష ఉద్యోగాలు భర్తీ చేయకుండానే పది సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు జి సురేష్ నాయక్, నాయకులు రాహుల్, అజయ్, భాను, సంతోష్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి

భగత్‌నగర్, మే 31: ఎండ తీవ్రత దృష్ట్యా రద్దీ ప్రదేశాల్లో ప్రభుత్వమే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని వ్యవసాయకార్మిక సంఘం నాయకులు ఏవో సుధాకర్‌కు వినతిపత్రం అందించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి అజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్ల వడ్ల రాజు, సుందరగిరి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ వితరణ

కరీంనగర్ టౌన్, మే 31: ఎండలు మండిపోతుండడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు అనేక సంస్థలు ఉచితంగా మజ్జిగ పంపిణీ, చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. శుక్రవారం నగరంలోని కోర్టు సమీపంలో గల శ్రీలత టవర్స్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాదాపు 500 మందికి ఉచితంగా మజ్జిగను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో శ్రీలత టవర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు టమ్మడి సంపూర్ణ లీల, జాయ్ అనిల్‌కుమార్, కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ తాడ వీరారెడ్డి, నిర్మల, కోరుకంటి విజయలక్ష్మి తిరుపతిరావు, గాదె సుగుణ రాజేశం, గుడిసె భాగ్యలక్ష్మి లక్ష్మీకాంతం, పైడ రాధ ప్రభాకర్, యాచమనేని శైలజ, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

జమ్మికుంట రూరల్, మే 31: జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రాజమొగిలి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్‌గౌడ్ ఆరు వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పల్లె రవి, గండి రంజిత్‌కుమార్, గిరవేణ రాజయ్య, గిరవేణ భిక్షపతి, కొల్లూరి మురళి పాల్గొన్నారు.

చొప్పదండి: మండలంలోని రాగంపేటకు చెందిన తునికి జలేందర్, దీకొండ మహేందర్‌లు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు పేరం కిషన్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఐదువేల రూపాయల చొప్పున 10వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మామిడి లత, గుజ్జుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే

వీణవంక, మే 31: వీణవంక మండలం లస్మక్కపల్లి గ్రామానికి చెందిన దాసారపు శ్యామ్ (32) యువకుడు అనారోగ్యంతో శుక్రవారం మృత్యువాత పడ్డాడు. అంతిమ యాత్రకు హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి హాజరయ్యారు. యువకుడి ఆత్మకు శాంతి చేకురాలని ప్రార్థించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తన వంతు ఆర్థిక సహాయం అందజేశారు.

'జీవీ రామకృష్ణారావుపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదు'

మానకొండూర్, మే 31: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావును విమర్శిస్తే ఊరుకునేది లేదని మండల యూత్ విభాగం అధ్యక్షుడు అడప శ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల అభిలాష్ అన్నారు. మానకొండూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో జీవీఆర్ ముందుండి నడిచారన్నారు. మానకొండూర్ అభివృద్ధికి అనేక నిధులు మంజూరు చేయించి చేసిన పనులు కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని విమర్శించారు. శేఖర్, రాజు, శ్రీనివాస్,ప్రవీణ్,సందీప్,శ్రావణ్,రమేశ్ ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

హుజూరాబాద్‌రూరల్, మే31:మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లికి చెందిన ముగ్దుంపురం అనిల్ కుమార్(39) జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని ఓ దుకాణంలో గుమాస్తాగా పచేస్తున్నాడు. అనిల్‌కుమార్‌కు కళ్లు సరిగ్గా కనిపించకపోవడంతో దుకాణంలో ఇబ్బందులు పడేవాడు. దీంతో కళ్లు సరిగ్గా కనిపించడం లేదంటూ జీవితంపై విరక్తి చెంది తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలోనే ఈ నెల 30న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌కు తరలించారు. అక్కడి నుంచి హుజూరాబాద్‌కు తీసుకొస్తున్న క్రమంలో శుక్రవారం మృతి చెందాడు.